మూతిని బిగించి తీసుకెళ్ళాడు. కాలి నడకన నాలుగు రోజులు ప్రయాణించి అతను తన గురువుని కలుసుకున్నాడు. ఆయనకి వినయంగా నమస్కరించి, తను తెచ్చిన మంచి నీటిని ఓ గ్లాసులో పోసి ఇచ్చాడు. దాన్ని గురువు తాగి, అంతటి రుచికరమైన మంచి నీటిని తెచ్చినందుకు సంతృప్తిని వ్యక్తం చేసాడు. ఆ శిష్యుడు ఆనందంగా వెళ్ళిపోయాక, గురువు ప్రధాన శిష్యుడు ఆ తోలు సంచీలోని నీటిని రుచి చూద్దామని కొద్దిగా తాగి వెంటనే ఉమ్మేసి గురువుని అడిగాడు.

"ఈ నీరు చెడిపోయి వాసన వేస్తోంది. మరి మంచి నీటిని తాగినట్లుగా అతనితో ఎందుకు మాట్లాడారు?"

"నువ్వు రుచి చూసింది కేవలం నీటినే. నేను అతను తెచ్చిన బహుమతి వెనక వున్న ఇవ్వాలన్న తపనని రుచి చూసాను." చెప్పాడు గురువు.

ఏదైనా ఇవ్వడానికి వెనక వుండే ప్రేమ వెల లేనిది.

## 179. దేవుడి కంఠం

"నాతో దేవుడు మాట్లాడితే ఆయన కంఠం వినాలని వుంది." హిమాలయాల్లోని ఓ యోగితో చెప్పాడు ఓ యాత్రికుడు.

ఆ యోగి మౌనంగా తల వూపి తన వెంట రమ్మన్నట్లుగా సౌంజ్ఞ చేసాడు. ఆ యాత్రికుడు యోగిని అనుసరించాడు. రెండు రోజులు నడిచి అత్యంత ఎత్తయిన ఓ పర్వత శిఖరం మీదకి అతను యోగితో పాటు చేరుకున్నాడు.

"ఇప్పుడు జాగ్రత్తగా విను." చెప్పాడు యోగి.

అంతదాకా ఆ యాత్రికుడు తన జీవితంలోఎన్నడూ విననంత ఘనీభవించిన నిశ్శబ్దాన్ని విన్నాడు.

"దేవుడి కంఠం విన్నాను. చాలా బావుంది." చెప్పాడు అతను.